క్లుప్తంగా...

ఎన్ఎంఐఎంఎస్‌లో ఎంబీఏ ప్రోగ్రాంకు రిజిస్ట్రేషన్లు

లాలాపేట: ఎన్ఎంఏటి ద్వారా హైదరాబాద్‌లో తార్నాకలోని నర్సిమోంజీ ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ మెనేజ్‌మెంట్ స్టడీస్(ఎన్ఎంఐఎంఎస్)లో 2024 విద్యా సంవత్సరానికి ఎంబీఏ ప్రోగ్రాంలో ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు అధికారులు గురువారం ఎన్ఎంఐఎంఎస్ హైదరాబాద్ డైరెక్టర్ సిద్ధార్థ ఘోష్ ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. వివరాలకు 8451940626 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థికి డిప్యూటీ మేయర్ మద్దతు

లాలాపేట: త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రకటించిన ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి(బిఎల్ఆర్) తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, బిఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డిలు ప్రకటించారు. గురువారం బండారి లక్ష్మారెడ్డి తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో మోతే శ్రీలతశోభన్ రెడ్డి దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ లక్ష్మారెడ్డిని శాలువాతో సత్కరించి అభినందించారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో కోట నీలిమా

సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందనే విశ్వాసం పెరిగిందని, అందుకే స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమా అన్నారు. బేగంపేట, రాంగోపాల్‌పేటకు చెందిన వివిధ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో ఆమె ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం నీలిమా మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. పార్టీ పూర్వవైభవం రానున్నదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

మొబైల్ యాప్ ద్వారా కొత్త ఓటర్ల నమోదు




అమీర్‌పేట: బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మొబైల్ యాప్ ద్వారా కొత్త ఓటర్లను నమోదు చేస్తున్నారు. గురువారం అమీర్‌పేట డివిజన్‌లో ఇంటింటికీ తిరిగి ఓటరు నమోదు చేపట్టారు. లీలానగర్‌లో మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులుకు ఓటరు స్లిప్‌ను అందజేశారు.

ఘనంగా హిందీ భాషాదినోత్సవం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ రేఖారాణి

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్‌పద్మారావునగర్ ఎస్పీ కాలేజీలో గురువారం హిందీ భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఇఫ్లూ యూనివర్సిటీ హిందీ విభాగం ప్రొఫెసర్ రేఖారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హిందీ బాషా గొప్పదనాన్ని, బాషా ప్రాముఖ్యత గురించి వివరించారు. హిందీ బాషా హృదయ బాష అని పేర్కొన్నారు. హిందీ భాషా నేర్చుకుంటే దేశంలో ఎక్కడైనా జీవించడానికి, ఉద్యోగం చేయడానికి ఎంతో ఉపకరిస్తుందన్నారు. డాక్టర్ ఎస్. హేమలత, అమరనాథ్ శర్మ, హిందీ విభాగం అధ్యాపకురాలు ప్రియాంకాషా, సాయినాథ్‌లతో పాటు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిపై విద్యార్థులకు అవగాహన



పద్మారావునగర్: శారీరక వ్యాయామం, యోగా, ఆహార నియమాలు, ధ్యానం, శ్వాస నియమాలు మానసిక ఒత్తిడి నుంచి దూరం కావడానికి దోహదపడుతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. సికింద్రాబాద్ పద్మారావు నగర్‌లోని సుప్రసిద్ధమైన సర్దార్ పటేల్ కాలేజీలో గురువారం జీవశ్రీ ఫౌండేషన్ అధ్వర్యంలో మానసిక ఒత్తిడి పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయుర్వేద నిపుణులు డాక్టర్ సత్యదీప, డాక్టర్ కల్పన, డాక్టర్ సునీత గ్రేస్ తదితరులు మాట్లాడారు. విద్యార్థులు ప్రతి విషయానికి ఆందోళనకు గురికావద్దని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. హేమలత, అమర్‌నాథ్ శర్మ, న్యూట్రీషన్ విభాగం అధిపతి ఇ. జయదీప్ పాల్గొన్నారు.


నిరుపయోగంగా తుప్పపట్టి పోతున్న రైల్వే ఆఫీసర్స్ క్లబ్ ముందు ఏర్పాటు చేసిన ఫుట్‌ఓవర్ వంతెన


ఫుట్‌ఓవర్ వంతెన ఏర్పాటు చేయాల్సిన మెట్టుగూడ కూడలి

మెట్టుగూడ పాదచారులకు తప్పని తిప్పలు

- రోడ్డుదాటేందుకు ప్రమాదకర పరిస్థితులు
- అవసరం లేనిచోట ఫుట్‌ఓవర్ వంతెన
- విద్యార్థులు, మహిళలకు మరిన్ని ఇబ్బందులు

సికింద్రాబాద్: మెట్టుగూడ కూడలిలో మెట్రో స్టేషన్ ఏర్పాటు, అదే కూడలిలో జంక్షన్ మూసివేతతో ఆయా ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. మెట్రో స్టేషన్, జంక్షన్ మూసివేత కారణంగా నాలుగేళ్లుగా ఈ ప్రాంతంలోని వాహనదారులు, పాదచారులు ఇబ్బందుల పాలవుతున్నా పాలకులు పట్టించుకున్న పాపాన పోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆరేళ్ల క్రితం రహదారి విస్తరించిన అధికారులు మెట్టుగూడ కూడలిలోకి ట్రాఫిక్ సిగ్నళ్లు అందుబాటులోకి వచ్చాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాదచారులు, వాహనదారులు సిగ్నల్స్ ఆధారంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా దారిదాటి వెళ్లేవారు. మెట్టుగూడ కూడలిలో ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటు ఆనందం ఎంతోకాలం నిలువలేదు.

మెట్రో స్టేషన్ ఏర్పాటుతో.....

రైల్వేస్థలాలు సేకరించి మెట్టుగూడ ప్రధాన రహదారిని ఆసాంతం విస్తరించిన మీదట మెట్రోస్టేషన్ అందుబాటులోకి వచ్చింది. వాహనాల రాకపోకలు, ప్రయాణికుల సంఖ్య క్రమేణా పెరిగింది. పాదచారులకు మరిన్న ఇబ్బందులు ఎదురయ్యాయి. సమస్యకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చూపించాల్సిన ట్రాఫిక్ పోలీసులు ఏకంగా మెట్టుగూడ జంక్షన్‌ను మూసివేసి స్థానికులకు సమస్యలు తెచ్చిపెట్టారు. సికింద్రాబాద్ వైపు ఆలుగడ్డబావి వద్ద, తార్నాక వైపు రైల్వే డిగ్రీ కళాశాల వద్ద 'యూ' టర్న్‌లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. జంక్షన్ మూసివేతతో మెట్టుగూడ నుంచి సికింద్రాబాద్ వెళ్లాల్సిన వాహనదారులు, లాలాగూడ, తార్నాక వైపు వెళ్లాల్సిన వాహనదారులు రెండు కిలోమీటర్ల దూరం వరకు వెళ్లి వాహనాలు తిప్పుకుని రావాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. మెట్టుగూడ జంక్షన్ మూసివేతను వ్యతిరేకించిన పలువురు స్థానికుల ఆందోళనలు ఫలించలేదు.

పాదచారుల ఇబ్బందులు ఎన్నో...

వాహనదారులు చుట్టూరా తిరిగి రావాల్సిన పరిస్థితులు ఎదురవగా పాదచారులకు సీత కష్టాలు వచ్చి పడ్డాయి. మెట్టుగూడ ప్రాంతంలోని పలువురు పాదచారులు లాలాగూడ, తార్నాక ప్రాంతాలకు వెళ్లేందుకువందలాది వాహనాలు దాటుకుని వెళ్లక తప్పని ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి. కూడలిలో పాదచారుల కోసం కొద్ది సెకన్లు ట్రాఫిక్ సిగ్నల్ స్టాప్‌ను ఏర్పాటు చేసినప్పటికీ ఇక్కడి నుంచి రోడ్డు దాటేందుకు పాదచారులు ధైర్యం చేయడం లేదు. ఆలుగడ్డబావి బస్‌స్టాప్ ప్రాంతం వద్ద ఏర్పాటు చేసిన యూటర్న్ మార్గం ద్వారా రోడ్డు దాటేందుకు సర్కస్ ఫీట్లు చేయాల్సిన ప్రమాదకర పరిస్థితులు ఉంటున్నాయి. ముఖ్యంగా రెండు వైపులా విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులను రోడ్డు దాటించడం వారి తల్లితండ్రులకు కష్టసాధ్యం అవుతుంది.

నిరుపయోగంగా ఫుట్‌ఓవర్...

మెట్టుగూడ కూడలి లేదా ఆలుగడ్డబావి ప్రాంతంలో ఫుట్‌ఓవర్ వంతెన ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉండగా అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదు. ఎస్‌పీ రోడ్డు, తార్నాక-లాలాపేట రోడ్డులో అంతగా అవసరంలేని రెండు ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ వంతెనలు నిర్మించిన జీహెచ్ఎంసీ అధికారులు రోడ్డుదాటే పాదచారుల సంఖ్య అత్యధికంగా ఉండే మెట్టుగూడ ప్రాంతంలో ఫుట్‌ఓవర్ ఏర్పాటు చేయడం లేదని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇదే కూడలికి దూరంగా రైల్వే ఆఫీసర్స్ క్లబ్ ఎదరుగుండా మెట్రో రైల్ అధికారులు ఏర్పాటు చేసిన ఫుట్‌ఓవర్ వంతెన నిరుపయోగంగా ఉంటుంది. నాలుగేళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన క్రమణా తుప్పుపట్టి పోతుంది. మెట్టుగూడ ప్రజల బ్బందులు పరిగణలోకితీసుకుని మెట్టుగూడ కూడలి నుంచి ఆలుగడ్డబావి కూడలి మధ్యలో ఫుట్‌ఓవర్ వంతెన ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కొసమెరుపు..

ఎస్‌పీ రోడ్డు, లాలాపేట రోడ్డులో అంతగా జనసాంద్రత లేని ప్రాంతాల్లో ఫుట్ ఓవర్లు ఎందుకు ఏర్పాటు చేశారన్న ప్రశ్నకు జీహెచ్ఎంసీ అధికారుల నుంచి స్పందన లేదు. మెట్టుగూడలో పాదచారులు రోడ్డు దాటే ఇబ్బందులకు పరిష్కారం ఎప్పుడన్న సాక్షి ప్రశ్నకు మాత్రం ఇక్కడి ప్రజలు ఊరట చెందే సమాధానం ఇస్తున్నారు. ఇదే రహదారిలో తార్నాక సుదర్శన్‌రెడ్డి స్వీట్‌హౌజ్ వద్ద మరో ఫుట్‌ఓవర్ వంతెన నిర్మించాల్సి ఉండగా సాంకేతిక కారణాలతో నిలుపుదల చేశామన్నారు. అదే బడ్జెట్‌తో మెట్టుగూడ-ఆలుగడ్డబావి ప్రాంతంలో ఫుట్‌ఓవర్ వంతెనను ఏర్పాటు చేస్తామని జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు హామీ ఇవ్వడం కొసమెరుపు.

రాష్ట్రంలో కుటుంబ పాలన నడుస్తోంది


సమావేశానికి హాజరైన రూబితో కాంగ్రెస్ పార్టీ నేతలు

అమీర్‌పేట: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ చేపట్టిన హాత్ జోడో పాదయాత్రతో బీజేపీ నాయకుల్లో వెన్నులో వణుకు మొదలైందని కర్నాకట ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు రూబిన్ మనోహర్ అన్నారు.ఈ నెల 17న తుక్కుగూడలో జరుప తలపెట్టిన సీడబ్ల్యుసీ-విజయభేరి సభ సందర్భంగా సనత్‌నగర్ నియోజకవర్గ నాయకులు,కార్యకర్తలతో అమీర్‌పేటలో సమావేశం నిర్వహించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్ అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమానికి హాజరైన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అమాయకులు బలిదానాలు చేసుకోవడాన్ని జీర్ణించుకోలేక అధినేత్రి సోనియాగాంధీ కాంగ్రెస్ పార్టీకి నష్టం వాటిల్లినా ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రంలో కుటుంబ పాలన నడుస్తుందని విమర్శించారు. లిక్కర్ కేసులో ఎమ్మెల్సి కవిత ఇరుక్కుపోయిందన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నియోజకవర్గంలో ఇంటింటికి తిరిగి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలనుప్రజలు వివరిస్తామని చెప్పారు.

కేయూ విద్యార్థుల పై దాడి అమానుషం

ఉస్మానియా యూనివర్సిటీ: కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) విద్యార్థుల పై పోలీసుల దాడి అమానుషమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ విద్యార్థి జేఏసీ ఛైర్మన్ భట్టు శ్రీహరినాయక్ పేర్కొన్నారు. గురువారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లు, పీహెచ్‌డీ ప్రవేశాలలో జరిగిన అవకతవకలపై కేయూ వీసీ, రిజిస్ట్రార్‌ను నిలదీసినందుకు వరంగల్ సీపీ రంగనాథ్ ప్రాద్బలంతో విద్యార్థులపై లాఠీఛార్జి చేసి తీవ్రంగా గాయపర్చడం దారుణమన్నారు. సీపీ రంగనాథ్ పై చట్టపరమైన చర్యలు తీసుకొని, విద్యార్థుల సమస్యల పై స్పందించకుండ బీఆర్ఎస్ ప్రభుత్వానికి తొత్తులుగా మారిన వీసీ, రిజిస్ట్రార్‌ను వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వర్సిటీలను నిర్వీర్యం చేస్తూ ప్రవేటు వర్సిటీలను ప్రొత్సహిస్తున్న ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగడల పై సమగ్ర విచారణ జరిపించి పదవీ నుంచి తొలగించాలన్నారు. లేని పక్షంలో జనగామా నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తే విద్యార్థుల సత్తాచూపి ఓడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి జేఏసీ అధ్యక్షులు తూము నవీన్‌యాదవ్, టీజీవీపీ రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి ప్రశాంత్, విద్యార్థి నేతలు గడ్డం శ్రీనివాస్‌ప్రవీణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు

అడ్డగుట్ట: నిరుపేదలైన భవన నిర్మాణ కార్మికులకు డబుల్ బెడ్రూమ్‌లు మంజూరు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు గౌరీ నాగరాజు కోరారు. గురువారం అడ్డగుట్టలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తు పెట్టుకున్న భవన నిర్మాణ కార్మికులకు ప్రత్యేక చొరవతో ఇళ్లు మంజూరు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు భవనాలను నిర్మించిడం తప్ప అందులో ఉండలేని పరిస్థితి ఉందని, అందువల్ల అర్హులైన భవన నిర్మాణ కార్మికులను గుర్తించి డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు పాకాల యాదగిరి, బాలరాజ్, అంజయ, రామచంద్ర, వెకంటేష్, యాదగిరి, షాన్ పాషా, అజీముద్దిన్, సాయిలు, సింగరయ్య తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై డిప్యూటీ మేయర్ సమీక్ష



తార్నాకలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో ప్రజలకు ఏలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలనీ జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ మేరకు గురువారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఆయా విభాగాల అధికారులతో డిప్యూటీ మేయర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్ల మరమ్మతులు, రహదారుల ప్రక్కన ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాలనీ, మండపాల వద్ద కావాల్సిన శానిటేషన్ ఏర్పాట్లపై దృష్టిసారించాలన్నారు. తాత్కాలిక నిమజ్జన కొలనుల ఏర్పాటు, వ్యర్థాల తొలగింపు వంటి చర్యలు చేపట్టాలనీ అన్నారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా మండప నిర్వాహకులకు తగిన జాగ్రత్తలపై విద్యుత్ శాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఉత్సవాల నేపద్యంలో అధికారులంతా సమన్వయంతో విధులు నిర్వహించాలనీ అన్నారు. అప్పుడే ప్రజలకు ఏలాంటి సమస్యలు వచ్చినా వెంటనే పరిష్కరించడానికి వీలవుతుందని పేర్కొన్నారు.

బీసీలకు 50శాతం సీట్లు కేటాయించాలి


పీసీసీ ఓబీసీ కమిటీకి వినతి పత్రం అందజేస్తున్న బీసీ శక్తి సంఘం ప్రతినిధులు

కంటోన్మెంట్: త్వరలో జరగబోయే ఎన్నికల్లో బీసీలకు 50 శాతం టికెట్‌లు కేటాయించాలని బీసీ శక్తి సంఘం అధ్యక్షులు పిట్ల నాగేశ్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పీసీసీ ఓబీసీ కమిటీని కలిసి తమ డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పిట్ల నాగేశ్ మాట్లాడుతూ బీసీలకు జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలు 50 శాతం సీట్లు కేటాయించడంతో పాటు సీఎం అభ్యర్థిగా బీసీని ప్రకటించాలన్నారు. బీసీ భవన్ ఏర్పాటుతో పాటు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలన్నారు. 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ముదిరాజ్‌లను బీసీ -డీ నుంచి బీసీ-ఏలోకి మారుస్తూ ఇచ్చిన జీవో నెంబర్ 15ను అమలు చేయాలన్నారు. 2016లోనూ కేసీఆర్ ప్రభుత్వ జారీ చేసిన జీఓ నెంబర్ 6ను కూడా అమలు చేయాలన్నారు. పీసీసీ ఓబీసీ కమిటీని కలిసిన వారిలో నాగుల శ్రీనివాస్ యాదవ్, రమణ రావు, శంకర్ చారి తదితరులున్నారు.

కాంగ్రెస్ సమరభేరిని విజయవంతం చేయాలి


కాంగ్రెస్ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న రూబీమనోహరన్

సికింద్రాబాద్: నగర సమీపంలోని తుక్కుగూడలో ఈనెల 17న నిర్వహించనున్న కాంగ్రెస్ సమరభేరిసభను విజయవంతం చేసేందుకు అన్ని శ్రేణుల కాంగ్రెస్ నాయకులు సమష్టి కృషి చేయాలని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రూబీమనోహరన్ పిలుపునిచ్చారు. గురువారం నామాలగుండు బీఎస్ఆర్ గార్డెన్‌లో సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ఐదు డివిజన్ల ప్రతినిధుల సమరభేరిసన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రూబీమనోహరన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజావ్యతిరేక పరిపాలన విధానాలను ప్రజలకు వివరించేందుకు ప్రతీ కార్యకర్త అప్రమత్తం కావాలన్నారు. సమరభేరిసభను విజయవంతం చేయడం మొదలు బీఆర్ఎస్‌ను గద్దెదింపే వరకు నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉండాలని కోరారు. సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ద్వారా మాత్రమే అన్ని వర్గాల ప్రజలకు సంపూర్ణ న్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. మత విద్వేశాలకు వేదికగా ఉన్న బీజేపీ, అవినీతి ఊబిలో కూరుకుపోయిన బీఆర్ఎస్ ప్రభుత్వాల కుట్రలను ప్రజలకు వివరించడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం చేకూర్చాలన్నారు. సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నోముల ప్రకాశ్‌రావు, దీపక్‌జాన్, జగదీశ్, సురేశ్ లాల్, మాజీ కార్పోరేటర్లు ఆదం ఉమాదేవి, ఎంఆర్ శ్రీనివాస్‌రావు తదితరులు ప్రసంగించారు.

మహిళా సాధికారతే లక్ష్యం


శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న శ్రీగణేశ్

కంటోన్మెంట్: మహిళల స్వయం ఉపాధియే లక్ష్యంగా శ్రీగణేశ్ ఫౌండేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టిన శిక్షణా కేంద్రాల్లో శిక్షణ తీసుకున్న వారి సంఖ్య 3వేలు దాటిందని ఫౌండేషన్ చైర్మన్ ఎస్. శ్రీగణేశ్ అన్నారు. ఆయా శిక్షణ కేంద్రాలు ప్రారంభించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా గురువారం పికెట్ లక్ష్మీ నగర్, గాంధీ కాలనీల్లో కొనసాగుతున్న కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి మహిళ తన కాళ్ల మీద తాను నిలబడటమే లక్ష్యంగా తిఉరుమలగిరి, లాల్‌బజార్, బొల్లారం, బోయిన్‌పల్లి, సంజీవయ్య నగర్, గాంధీ కాలనీ, కాకగూడ, లక్ష్మీనగర్, గాంధీనగర్‌లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాల్లో టైలరింగ్, క్లాత్ బ్యాగ్‌ల తయారీ, బ్యూటీషియన్, మగ్గం వర్క్, అప్పడాల తయారీ వంటి రంగాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు త్వరలో మరో నాలుగు శిక్షణ కేంద్రాల ప్రారంభించనున్నట్లు తెలిపారు. మహిళా సాధికారతలో భాగంగా మహిళలకు స్వయం ఉపాధి కల్పిస్తూ, వారు ఆర్థికంగా ఎదగడం కోసమే ఈ ఉచిత ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ సానుకూలం


ఎమ్మార్పీఎస్ మహా దీక్షకు సంఘీభావం తెలుపుతున్న బోయిన్‌పల్లి వినోద్‌కుమార్

రసూల్‌పురా: ఎస్సీ వర్గీకరణ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకవస్తుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ తెలిపారు. ఈ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం చట్టభద్దత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ ఇంచార్జీ కిషన్ మాదిగ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ నియోజకవర్గం మడ్‌ఫోర్ట్ హట్స్‌లో గురువారం మహాదీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆ మార్గం గుండా వెళుతున్న బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ దీక్ష శిభిరం గమనించి ఎమ్మార్పీఎస్‌కు సంఘీభావం తెలిపారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో గతంలోనే అసెంబ్లీ తీర్మాణం చేసి పంపించామని తమ ఎంపీల సహకారంతో పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని అన్నారు.

వైద్య విభాగంలో నర్సింగ్ సేవలు కీలకం


గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో విద్యార్థులు, అతిథులు

రాంగోపాల్‌పేట్: వైద్య విభాగంలో నర్సింగ్ సేవలు ఎంతో కీలకమైనవని కిమ్స్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ ఎండీ భాస్కర్‌రావు అన్నారు. గురువారం కిమ్స్ ఆస్పత్రిలో నర్సింగ్ విద్యలో 14వ బ్యాచ్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రోగి ఆస్పత్రికి వచ్చి కోలుకుని తిరిగి వెళ్లే వరకు నర్సింగ్ సిబ్బంది ఎన్నో సేవలు అందిస్తారని ఆయన కొనియాడారు. డాక్టర్‌తో పాటు నర్సింగ్ సేవలు వైద్యంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. సైంటిస్ట్ వెల్మురుగన్ మాట్లాడుతూ వైద్య వృత్తి అనేది చాలా గొప్పదని అందులో నర్సింగ్ సేవలు చేసేందుకు గొప్ప మనసుండాలని ఆయన అన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థినిలు నర్సింగ్ విద్యలో మెలకువలు నేర్చుకుని ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి సీఈవో డాక్టర్ అభినయక్, ప్రొఫెసర్ మణిమాలరావు, డీఎంఈ రాజగోపాల్ పాల్గొన్నారు.

రేపు జెక్‌కాలనీ ముఖద్వారం ప్రారంభం

సనత్‌నగర్: గ్రీన్‌సిటీ అధినేత కొంద్రాజు సుబ్బరాజు తన సొంత ఖర్చుతో జెక్‌కాలనీలో నిర్మించిన ముఖ ద్వారాన్ని శనివారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాలనీకి వన్నె తెచ్చేవిధంగా నిర్మితమైన ఈ ముఖద్వారాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించనున్నారని జెక్‌కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూర్యశంకర్‌రెడ్డి, డాక్టర్ మల్లు ప్రసాద్‌లు తెలిపారు. నియోజకవర్గంలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న జెక్‌కాలనీలో ఇటీవల పూర్తి చేసిన అభివృద్ధి పనుల్లో భాగంగా ముఖద్వారాన్ని నిర్మించినట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

పదవతరగతి టాపర్‌లకు సత్కారం



అమీర్‌పేట: పదవతరగతి పరీక్షా ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు సత్కారం నిర్వహించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం 'పదవతరగతి టాపర్స్ ఫంక్షన్'నిర్వహించారు.ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ఆర్‌జేడి విజయ లక్ష్మి, తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్ డిప్యూటి సూపరెంటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం.నర్సింగ్‌రావు చేతుల మీదుగా మెమెంటోలు అందజేశారు.అమీర్‌పేట మండలం బీకేగూడలోని శ్రీ విద్యాంజలి హైస్కూలు విద్యార్థి తరపున స్కూలు కరస్పాండెంట్ సుధాకర్‌కు మెమెంటోను బహుకరించారు.

సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేస్తామని గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని జేఏసీ అధ్యక్షులు ధర్మతేజ డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్రంలోని 12 వర్సిటీల అధ్యాపకుల విధుల బహిష్కరణ, పెన్‌డౌన్- చాక్‌డౌన్ ఆందోళన కార్యక్రమంలో భాగంగా ఆర్ట్స్ కాలేజీ ఎదుట మానవ హారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్‌కు అన్ని అర్హత ఉన్నా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో తక్కువ వేతనాలకు పని చేసి శ్రమదోపిడీకి గురైన అధ్యాపకులకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోను అదే జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి


ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

సనత్‌నగర్: ఈ నెల 18 నుంచి 22 వరకు జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన దీక్షకు దిగారు. ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఇనుమల నరసన్నమాదిగ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు జిల్లా నేతలు హాజరై మాట్లాడారు. వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం తన మాటను నిలబెట్టుకోలేకపోయిందన్నారు. ఇప్పటికైనా ఎస్సీ వర్గీకరణ చేసి ఎస్సీలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో కేఆర్ లక్ష్మణ్ మాదిగ, టీ నారాయణ మాదిగ, బసప్ప మాదిగ, రామనాథ్ ఠాగూర్, రమేష్ మాదిగ, రాములు మాదిగ, టీవీ నరసింహారావు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ బీజేపీ టికెట్టు కోసం 27 మంది దరఖాస్తు

లాలాపేట: త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సికింద్రాబాద్ నియోజకవర్గం బిజేపి టికెట్టు కోసం తీవ్ర పోటీ నెలకొంది. దాదాపు 27 మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం. తెలంగాణ వచ్చాక సికింద్రాబాద్ నుంచి గత రెండు పర్యాయాలు వరుసగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టిఆర్ఎస్ (బీఆర్ఎస్) నుంచి తీగుళ్ల పద్మారావు గౌడ్ విజయం సాధించి అబ్కారి మంత్రిగా, ప్రస్తుతం డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇంతకుముందెన్నడూ సికింద్రాబాద్‌లో బీజేపి ఎమ్మెల్యేగా పోటీ చేయనేలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైయ్యాక జరిగిన రెండు ఎన్నికల్లో బిజేపి నామమాత్రంగానే పోటీ చేసింది. గతంలో బండారు దత్తాత్రేయ, ప్రస్తుతం కిషన్‌రెడ్డిలు సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యులుగా గెలిచి కేంద్ర మంత్రులుగా ఉన్నారు. కానీ సికింద్రాబాద్ అసెంబ్లీపై బిజేపి పట్టు సాధించలేకపోయింది. ఈ పర్యాయం ఇదే సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యులుగా కేంద్ర మంత్రిగా కొనసాగుతున్న కిషన్ రెడ్డి అండదండలతో సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందవచ్చుననే ఆశలతో చాలా మంది బిజేపి నేతలు సికింద్రాబాద్ నుంచి బీజేపి బరిలో ఉత్సాహం చూపిస్తున్నారు. ఈ క్రమంలో అధిక సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తుంది. కాగా దరఖాస్తు చేసుకున్న వారిలో గతంలో సికింద్రాబాద్ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే డా. జయసుధ, సినీ యాక్టర్ జీవితా రాజశేఖర్, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డితో పాటు మాజీ కార్పొరేటర్ ఆదం విజయ్, రవిప్రసాద్‌గౌడ్, గతం ఎన్నికల్లో 2018 లో ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన బండపల్లి సతీష్‌గౌడ్, మెట్టుగూడ కార్పొరేటర్ కంటెస్టెడ్ అభ్యర్థి శారదా మల్లేష్, గతంలో తార్నాక నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసిన సూదగోని లక్ష్మీ వెంకటేష్‌గౌడ్, సారంగపాణి, సుక్క గణేష్ ముదిరాజ్ తదితరులున్నారు.

ఇతర పార్టీల నుంచి నేతల చేరిక

ఇంత కాలం సికింద్రాబాద్ పార్లమెంట్‌కే పరిమితమైన బిజేపిలోకి రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సారథ్యంలో ఇటీవల కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే, మాజీ మేయర్, మాజీ కార్పొరేటర్లు, నేతలు, బిఆర్ఎస్ నుంచి పలువురు డివిజన్ స్థాయి నేతలు బిజేపిలో చేరారు. ఇతరుల చేరికతో కొంత బిజేపి పుంజుకుంది. దీంతో ఈ సారి ఎన్నికల్లో అసెంబ్లీలో బిజేపి పాగా వేస్తుందో లేదో చూడాలి మరి అంటున్నారు ఆ పార్టీ నాయకులు.